TGTEL/26/A4985

# ఆదాబ్ సైబరాబాద్

ADAAB CYBERABAD

ఎడిటర్ శివ కుమార్ బిఎస్ | సంపుటి : 1 సంచిక : 06 | శుక్రవారం, జూన్ 19, 2026, | పేజీలు - 4 | వెల: 5/-

## కేబినెట్‌లో కీలక నిర్ణయాలు..
# వెల్లడించిన మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్, జూన్18:** వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు.ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు మంత్రి ఉత్తమ్. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు.కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు.రాష్ట్రాభివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఈ కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.ఇక వీబీ- జీ ఆర్ఏఎం జీపై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు సీతక్క, తుమ్మల, ఉత్తమ్ ఉంటారు. దీనిపై ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత.. జూన్ 25 లోపు ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ నివేదిక అందజేయనుందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

## నిషేధంపై టెలిగ్రామ్
# పిటిషన్




**న్యూ ఢిల్లీ :**తాత్కాలికంగా నిషేధించాలన్న కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా టెలిగ్రామ్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. టెలిగ్రామ్, ప్రభుత్వం వాదనలను పరిగణనలోకి తీసుకున్నట్లు కోర్టు తెలిపింది. అంతకుముందు డార్క్‌వెబ్‌కు టెలిగ్రామ్ మరో రూపంగా మారిందని ఆరోపిస్తూ హైకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. నేరస్థులు, తీవ్రవాద ముఠాలు, ఇతర ప్రమాదకర శక్తులు విచారణ సంస్థల కళ్లు గప్పేందుకు ఆ యాప్‌ను వినియోగించడం పెరిగిందని తెలియజేసింది. లీకైన పరీక్ష పత్రాలు, ఉగ్రవాద భావజాలం, తప్పుడు సమాచారం వ్యాప్తి, చిన్నారుల లైంగిక దోపిడీ, డ్రగ్స్ స్మగ్లింగ్‌కు టెలిగ్రామ్ అడ్డాగా మారిందని ఆరోపించింది.

## ఇంధన, ఐటీ, ఎలక్ట్రానిక్స్, పర్యాటక, పెట్టుబడులు
# మౌలిక సదుపాయాలపై చర్చ



**అమరావతి:** సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 18వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశమైంది. ఈ నేపథ్యంలో పారిశ్రామికాభివృద్ధి ఫలాలు పేద, మధ్యతరగతి ప్రజలకు అందేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ సందర్భంగా ఇది ప్రభుత్వ ప్రధాన ఆశయమని సీఎం స్పష్టం చేశారు.కీలక ఆమోదాలు -- పెట్టుబడులు: ఈ ఉన్నతస్థాయి భేటీలో ఇంధన, ఐటీ, ఎలక్ట్రానిక్స్, పర్యాటక, పెట్టుబడులు- మౌలిక సదుపాయాలు, పరిశ్రమలకు సంబంధించిన ప్రాజెక్టుల ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. ఈ సమావేశంలో వివిధ కంపెనీల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. దాదాపు 50కి పైగా ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు మొత్తం రూ. 30,515 కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో కొత్తగా 29,677 ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.పారిశ్రామిక ఎకో సిస్టంపై సీఎం దిశానిర్దేశం: పరిశ్రమలు, కంపెనీలను కేవలం ధనికులు మాత్రమే స్థాపించగలరనే పాత భావన పోయేలా అధికారులు చొరవ తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు. రాష్ట్రంలో సామాన్యులు సైతం పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా ప్రోత్సాహకరమైన ఎకో సిస్టంను రూపొందించాలని ఆదేశించారు. పారిశ్రామికాభివృద్ధి ద్వారా వచ్చే లబ్ధి ప్రతి సామాన్య పౌరుడికి అందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.జీఎస్టీ, వివిధ మార్గాల్లో ఏపీకి ఆదాయం: ఎస్ఐపీబీ సమావేశంలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం కావాలంటే భూకేటాయింపులు జరిగిన వెంటనే ప్రాజెక్టుల పనులు క్షేత్రస్థాయిలో ప్రారంభం కావాలని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపనలో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. రాష్ట్రానికి జీఎస్టీ, ఇతర వివిధ మార్గాల ద్వారా సమకూరుతున్న ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని, ఏపీకి వచ్చే కొత్త పరిశ్రమలకు మెరుగైన ప్రోత్సాహకాలు అందించే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనివల్ల రాష్ట్రం పెట్టుబడులకు అనుకూలమైన వేదికగా మారుతుందని పేర్కొన్నారు.

## జులై 1 నుంచి 11 శాతం
# ఫిట్‌మెంట్



**హైదరాబాద్, జూన్ 18:** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. (గురువారం) టీజీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు.హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మీ పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు టీజీఎస్ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు.పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయనున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం జరగనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఎవరు అడ్డం పడ్డా భారత్ ఫ్యూచర్‌సిటీ
# నిర్మించి తీరుతాం

- రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలో వన మహోత్సవాన్ని ప్రారంభించిన సీఎం
- గుర్రంగూడ అర్బన్ ఎకో పార్క్ నమూనా సీఎంకు వివరించిన అటవీ అధికారులు
- హరిత నిధి ద్వారా నాగలింగం మొక్క నాటిన సీఎం




**హైదరాబాద్ :**ఎల్బీనగర్ ప్రాంతంలో 424 ఎకరాల విస్తీర్ణంలో పార్కు ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైడ్రాను తీసుకొస్తే దానిని భూతంగా చూపించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. న్యాయంగా నిర్మాణాలు చేసిన వారికి జోలికి హైడ్రా వెళ్లదని స్పష్టం చేశారు. నాళాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే మాత్రం హైడ్రా ఊరుకోదని ముఖ్యమంత్రి హెచ్చరించారు. చెరువులు కబ్జాలు చేయడం వల్లే కాలనీల్లో నీళ్లు నిల్వ ఉంటున్నాయన్న సీఎం, ప్రజలు ఈ విషయం గ్రహించాలన్నారు. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలో వనమహోత్సవాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన అనంతరం ప్రసంగించారు. ఢిల్లీలో గాలి, నీరు మట్నత్తం విషమని అక్కడ నివసించలేమని, వర్షం వస్తే ముంబయి, బెంగళూరులో బయటకు రాలేని పరిస్థితి ఉందన్నారు. ఢిల్లీ, ముంబయి, బెంగళూరు పరిస్థితి హైదరాబాద్ నగరానికి రాకూడదనే తమ ప్రయత్నమని తెలిపారు.అభివృద్ధి చెస్తామంటే అడ్డుకుంటున్నారు : మూసీ అభివృద్ధి చేస్తామంటే విపక్షాలు అడ్డుకుంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో మూసీ చుట్టుపక్కల ఉంటే దోమలు నోట్లోకెళ్లేవన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలనే తాము ప్రయత్నిస్తున్నామని, నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారని రేవంత్ రెడ్డి మండపడ్డారు. అలా చెప్పిన ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవడన్నారు. వాళ్ల ఫ్యూచర్?ను ప్రజలు నిర్ణయిస్తే ఫాంహౌస్?కు పరిమితమయ్యారన్నారు. కల్వకుంట వాళ్ల కడుపు నిండా కాలకూట విషమేనని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. మూసీలో కాలుష్యం కంటే కల్వకుంట వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువని రేవంత్ రెడ్డి అన్నారు. అందుకే ప్రజలు వాళ్లకు బుద్ధిచెప్పారన్నారు. ప్రజలు మురికిలోనే పొర్లాలని వాళ్లు భావిస్తున్నారన్నారు.ఎవరేమనుకున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం : ఎవరేమనుకున్నా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. సబర్మతి, యమునా కంటే గొప్పగా మూసీ ప్రక్షాళన చేస్తామన్నారు. చెరువులు, నాళాలు ఆక్రమిస్తే వీపులకు సున్నం పెడతామన్నారు. చెరువులు, నాళాలు ఆక్రమిస్తే వీపులకు సున్నం పెడతామన్నారు. ఎవరు అడ్డంపడి , ఎండ్రిన్? తాగినా ఫ్యూచర్? సిటీని నిర్మిస్తామన్నారు

## కేబినెట్ భేటీలో రైతు భరోసా నిధుల విడుదలకు
# ముహూర్తం ఫిక్స్




**హైదరాబాదా జూన్18:** జూన్ 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలం గాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది. జూన్ 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు(ఖరీఫ్, రబీ) విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది.మరోవైపు.. 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి.

## కోడి చెరువు భూముల వ్యవహారంలో పవన్ కళ్యాణ్‌పై
# దుష్ప్రచారం




**అమరావతి:**జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు, అసత్య వార్తలను ప్రచారం చేయడాన్ని నిషేధిస్తూ బెంగళూరు సిటీ సివిల్ కోర్టు బుధవారం ఆదేశాలు జారీ చేసింది. పవన్ కళ్యాణ్ తరపున (జీపీఏ హోల్డర్) రామ్‌ప్రసాద్ తల్లూరి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు ఈ ఆదేశాలను ఇచ్చింది. అలాగే తదుపరి విచారణ తేదీ వరకు పిటిషనర్‌కు వ్యతిరేకంగా ఎటువంటి పోస్టులు, ఆరోపణలు, ప్రకటనలు, వీడియో క్లిప్‌లను ప్రచురించడం, ప్రసారం చేయడం లేదా అప్‌లోడ్ చేయడం వంటివి చేయకూడదని ఎక్స్, మెటా, గూగుల్ ఇండియా, యూట్యూబ్, గూగుల్ యాజమాన్యాలను ఆదేశించింది. తెలంగాణలోని కోడి చెరువు భూముల వ్యవహారంలో దుష్ప్రచారంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు బెంగళూరు సిటీ సివిల్ కోర్టులో ఊరట కల్పిస్తూ తీర్పునిచ్చింది.ప్రభుత్వ భూములు, జలవనరులను (చెరువులను) పవన్ కళ్యాణ్ ఆక్రమించారన్న ఆరోపణలకు సంబంధించిన వివాదాస్పద లింక్‌లకు సంబంధించిన ఎటువంటి కంటెంట్‌ను షేర్ చేయకూడదని బెంగళూరు సిటీ సివిల్ కోర్టు ఆదేశించింది.

## రాయదుర్గం భూముల వేలంపై
# తెలంగాణ హైకోర్టు స్టే.



**హైదరాబాద్:** రాయదుర్గం భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. మూడు వారాల పాటు స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని టీజీఐఐసీ గౌర వెంచర్స్‌కు నోటీసులు జారీ చేసింది.హైదరాబాద్ రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని భూమికి టీజీఐఐసీ ఇటీవల వేలం నిర్వహించింది. ఈ స్థలాన్ని ఎకరాకు రూ.237కోట్ల చొప్పున గౌర వెంచర్స్ కొనుగోలు చేసింది. అయితే, ఆ భూమిలో 5 ఎకరాలు తమదేనంటూ హైకోర్టును ఎస్బీఐ బ్యాంక్ ఆశ్రయించింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. సర్వే నంబర్ 83/1లోని 5 ఎకరాల భూమి తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై ఈరోజు (గురువారం) విచారణ చేపట్టిన ధర్మాసనం.. రాయదుర్గం భూముల వేలంపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సమాచార నిర్వహణ 2.0 యాప్ పై శిక్షణ కార్యక్రమం




**పార్వతిపురం మన్యం జిల్లా,సాలూరు రూరల్,జూన్ 18** అన్నంరాజు వలస రైతు సేవా కేంద్రం పరిధిలో గురువారం అన్నంరాజు వలస గ్రామం లో ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కే. మహారాజన్ అధ్యక్షతన ,సాలూరు వ్యవసాయ సహా య సంచాలకులు, వ్యవసాయ అధికారి, ఉద్యాన అధికారుల ఆధ్వర్యంలో , ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ సేవలు డిజిటలీ కరణ లో భాగంగా 2.0 యాప్ పై శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె శిరీష మాట్లాడుతూ ప్రతి రైతు పంట సాగు విధానాలు అధునాతన పద్ధతులు అవలింబించేలా ప్రభుత్వం ఒక క్రొత్త యాప్ ను అందుబాటులోకి తీసుకొచ్చిందని అదే ( ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సమాచార నిర్వహణ 2.0) అని తెలియచేస్తూ ప్రతి రైతు ఈ యాప్ ను వినియోగించడం ద్వారా రైతుకు ఒక పంటకు కావాల్సిన సమాచారం అంతా తెలుసుకోవచ్చని అన్నారు. ఈ యాప్ లో ఒకసారి రైతు తన ఆధార్ నెంబర్ తో లాగిన్ అవ్వడం ద్వారా రైతు యొక్క భూమి, పంటలు వివరములు వాటికి సంబంధించిన ఎరువులు వివరములు కూడా తెలుసుకోవచ్చని తెలియచేశారు. తదుపరి వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీ సత్యవతి మేడం గారు మాట్లాడుతూ ఈ-ూూూ×మీా 2.0 యాప్ లో ప్రస్తుత వాతావరణ పరిస్థితులు తద్వారా రైతులు పంటలు సాగులో అనుసరించాల్సిన అంశాలు రైతుల పూర్తిగా తెలుసుకోవచ్చని తెలియజేశారు అంతేకాకుండా పంటకు కావలసిన ఎరువులు ఎంత మోతాదులో అవసర మవుతాయో కూడా ఈ యాప్ ద్వారా రైతు తెలుసుకోవచ్చని మరియు తన ఉన్న మొత్తం భూమికి వేసిన పంటకు అనుగుణంగా ఎంత ఎరువు అవసరం అవుతుందో కూడా ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని మరియు మొదటి విడతగా పంటకు కావలసిన ఎరువులను కొనుగోలు చేయవచ్చని తెలియజేయడం జరిగింది. తదుపరి మండల ఉద్యాన శాఖ అధికారి శ్రీమతి ఝాన్సీ గారు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు ఉద్యాన శాఖ పరంగా ఆయిల్ పామ్ మొక్కలను సబ్సిడీపై ప్రభుత్వం సరఫరా చేస్తుందని అవసరమగు రైతులు వెంటనే దరఖాస్తు ఫారంలను సంబంధిత వ్యవసాయ లేదా ఉద్యాన సహాయకులకు ఇవ్వాలని తద్వారా ఆయిల్ పామ్ మొక్కలను సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు.

# గుర్రంపోడు మోడల్ స్కూల్ విద్యార్థుల బస్సు సౌకర్యం కొరకు ఎమ్మెల్యే జైవీర్ రెడ్డికి వినతి



**గుర్రంపోడు: జూన్ 18,** :నాగార్జునసాగర్ నియోజకవర్గం గుర్రంపోడు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థుల రవాణా ఇబ్బందులను తొలగించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జి. రాగిణి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు గురువారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి విద్యార్థుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుర్రంపోడు మోడల్ స్కూల్‌కు వచ్చే మోసంగి, చేపూరు, తేరాటిగూడెం గ్రామాలకు చెందిన విద్యార్థులు సరైన రవాణా సౌకర్యం లేక ప్రతిరోజూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా, ఈ గ్రామ ప్రజల సౌకర్యార్థం వెంటనే బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని లేదా కొత్త రూట్లను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన సత్తయ్య యాదవ్, నామల సురేష్, మర్రి బిక్షపతి, పదిర హరిప్రసాద్, కంసాని పాండు, తేరాటిగూడెం, మోసంగి, చేపూరు గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు మరియు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవ్ 2026 సందర్భంగా వరంగల్ జిల్లాలో రూ.1.84 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం



**వరంగల్ జిల్లా: జూన్ 18** రాష్ట్ర స్థాయి వన మహోత్సవ్--2026 వేడుకల సందర్భంగా వరంగల్ జిల్లాలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేసిన అభివృద్ధి, ఎకో-టూరిజం మౌలిక సదుపాయాల పనులను గురువారం సాయంత్రం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్య శారద, సీపీ సన్ ప్రీత్ సింగ్, అదనపు కలెక్టర్లు గణేష్, సంధ్యారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సంపేట రేంజ్ పరిధిలోని పాఖాల్ బయోడైవర్సిటీ పార్క్ లో సందర్శకుల సౌకర్యాల విస్తరణకు చేపట్టిన పలు పనులు అందుబాటులోకి వచ్చాయి. సఫారీ వాహనాలు, పెడల్ బోటింగ్ పూల్, పర్యావరణ విద్యా కేంద్రం (ఈఈసీ) భవనం, డార్మిటరీ హాల్, నైట్ క్యాంపింగ్ ప్రాంతం, ఆర్‌వో ప్లాంట్, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను హరిత నిధి, బయోసోట్, అఫారెస్టేషన్ ఫండ్స్, జాపాట్ పథకాల కింద రూ.153.95 లక్షల వ్యయంతో పూర్తి చేశారు. అదేవిధంగా, వరంగల్ జిల్లా అటవీ కార్యాలయ భవనంలో పునరుద్ధరణ, ఆధునికీకరణ పనులను సీఏ-పీడీ ఇంటరెస్ట్ నిధుల కింద రూ.30 లక్షల వ్యయంతో చేపట్టి పూర్తి చేశారు. మొత్తం రూ.183.95 లక్షల విలువైన ఈ అభివృద్ధి పనులు ఎకో-టూరిజం ప్రోత్సాహం, పర్యావరణ విద్య విస్తరణ, సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పన, అటవీ శాఖ మౌలిక వసతుల బలోపేతానికి దోహదపడనున్నాయని అధికారులు తెలిపారు. వన మహోత్సవ్ సందర్భంగా ఈ పనుల ప్రారంభం రాష్ట్ర ప్రభుత్వం




పర్యావరణ పరిరక్షణ, అటవీ సంపద అభివృద్ధి, ప్రకృతి ఆధారిత పర్యాటక రంగ ప్రోత్సాహానికి ఇస్తున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులచే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఉమారాణి, డీసీపీ అంకిత్, డిఎఫ్ వో బోగ నిఖిత, ఏసీపీ రవీందర్ రెడ్డి, వరంగల్ ఎఫ్ ఆర్ వో రాధిక, నర్సంపేట ఎఫ్ ఆర్ వో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నందిగామ పాఠశాలలో మొదటి రోజే ఉపాధ్యాయుల కొరత

- విద్యార్థుల తల్లి దండ్రులు అయోమయం రెగ్యులర్ టీచర్ నియమించాలని డిమాండ్
- మన్నలక్ష్యం న్యూస్ కు స్పందన
- నందిగామ గిరిజన పాఠశాలను సందర్శించిన ఏటీడిఓ భాస్కర్
- నందిగామ పాఠశాలకు పూర్తి ఉపాధ్యాయున్ని నియమించిన అధికారులు




**కొమరం బీమ్ ఆసిఫాబాద్ :జూన్ 18, :**కొమరం బీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలంలోని కమ్మర్‌గామ్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గిరిజన ప్రాథమిక పాఠశాల, నందిగామను ఏటీడిఓ భాస్కర్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల హాజరు, బోధనా కార్యక్రమాలను పరిశీలించారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు ఎన్. హన్మంతు పూర్తి స్థాయిలో తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఏటీడిఓ ఆదేశించారు. అనంతరం కమ్మర్‌గామ్ గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలను కూడా ఆయన సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీ. రవీందర్ మాట్లాడుతూ, ఏటీడిఓ పాఠశాలను సందర్శించి పలు సూచనలు, సలహాలు అందించినట్లు తెలిపారు.

## ఎస్బీఐ భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు స్టే




**హైదరాబాద్ : జూన్ 18,** ˇత నెల 28వ తేదిన రాయదుర్గం పరిధిలో ఉన్న నాలెడ్జ్ సిటీలోని సర్వే నంబర్ 83/1లో ఉన్న భూమిని ఒక్కో ఎకరం రూ.237 కోట్ల చొప్పున ఆక్షన్ ద్వారా విక్రయించిన కాంగ్రెస్ ప్రభుత్వంఅయితే ఆ భూమిలో 5 ఎకరాలు తమవేనని, సదరు భూమిపై రిట్ ఆర్డర్ ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించిన ఎస్బీఐదీంతో టీజీఐఐసీ భూముల వేలంపై 3 వారాలు స్టే విధించిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఎస్బీఐ, టీజీఐఐసీ, గౌర వెంచర్స్‌కు నోటీసులు జారీ

# ఈ రెండున్నరేళ్ల కాలంలోనే 66,038 రైతు కుటుంబాలకు 3301.90 కోట్ల రైతుబీమా చెల్లింపు

**– ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం ప్రీమియం ను చెల్లించాం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**హైదరాబాద్ : జూన్ 18** రైతు మరణించిన సందర్భంలో వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం అత్యంత బాధ్యతతో అమలు చేస్తోం దన్నారు. ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియాన్ని ప్రభుత్వం ఇప్పటికే చెల్లించిందన్నారు. రైతు బీమా పథకాన్ని నిలిపివేసినట్లు ప్రచారం పూర్తిగా అసత్యమని మంత్రి తుమ్మల అన్నారు. రైతు సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు ఉపయోగపడే ఏ ఒక్క పథకాన్ని నిలిపివేసిన దాఖలాలు లేవని, పథకాలను నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర గత ప్రభుత్వానిదే అని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యాంత్రీకరణ, సాయిల్ హెల్త్ టెస్ట్, సబ్సిడీపై విత్తనాలు వంటి పథకాలను నిలిపివేయడమే కాకుండా స్టేట్ వాటాను విడుదల చేయకుండా కేంద్ర ప్రాయోజిత పథకాలను సైతం రైతులకు దూరం చేసిందని విమర్శించారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం అమలు చేస్తున్న పథకా లను ఎలాంటి బేషజాలకు పోకుండా అమలు చేయడమే కాకు ండా.. గత ప్రభుత్వం ఆపేసిన పథకాలను పునరుద్ధరిస్తూ రైతు లకు అండగా నిలుస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదే అని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 66,038 మంది రైతుల కుటుంబాలు రైతు బీమా పథకం ద్వారా లబ్ధి పొందాయని మంత్రి తెలిపారు. ఆయా కుటుంబాల నామినీల ఖాతాల్లో మొత్తం రూ. 3301.90 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. 2023 డిసెంబర్ నుంచి ఆ ఏడాది ముగిసే వరకు 20,090 కుటుంబాలకు రూ.1,004.50 కోట్లు, 2024 సంవత్సరంలో 25,861 కుటుంబాలకు రూ.1,293.05 కోట్లు బీమా సాయంగా అందించినట్లు వివరిం చారు. 2025-26 సంవత్సరానికి రాష్ట్రంలో 42.16 లక్షల మంది రైతులు రైతు బీమా పథకంలో నమోదు చేసుకున్నారని, వీరందరికీ వర్తించేలా ఎల్ఐసీకి చెల్లించాల్సిన మొత్తం వార్షిక ప్రీమియం రూ.1,359.56 కోట్లను ప్రభుత్వం పూర్తిగా చెల్లించిం దన్నారు. దీంతో 20,087 కుటుంబాలకు రూ.1004.35 కోట్లు బీమా సహాయంగా అంది, మరణించిన రైతు కుంటుబాలకు ఆర్థిక చేయూత అందించడం జరిగిందని అన్నారు.

రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నాలు మానుకోవాలని మంత్రి హితవు పలికారు. రైతు మరణంతో దుఃఖంలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి వారిని ఆర్థికంగా నిలదొక్క కొనే విధంగా రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

## కామాంధుల వేధింపులకు.. షార్ట్ ఫిల్మ్ నటి అమూల్య శ్రీ బలి



**హైదరాబాద్ : జూన్ 18, :**హీరోయిన్ అవ్వాలనే కోరికతో నగరానికి వచ్చిన అమూల్య.. షార్ట్ ఫిల్మ్స్‌తో మంచి గుర్తింపుకెరీర్ సాఫీగా సాగుతుండగా.. ఆమె బాత్రూం వీడియోలు తీసి నరకం చూపించిన కామాంధులుతమ కోరిక తీర్చాలని.. లేదంటే వీడియోలు లీక్ చేస్తామని 6 నెలల నుంచి నిందితుల బ్లాక్‌మెయిల్‌చివరికి నిందితుల వేధింపులు భరించలేక.. ఆత్మహత్యకు పాల్పడిన అమూల్య శ్రీసూసైడ్‌కి ముందే పోలీసుల్ని ఆశ్రయించినా.. పట్టించుకోకపోవడంతో అమూల్య బలవన్మరణంకన్నీరుమున్నీరవుతున్న తల్లి.. నిందితులను అరెస్ట్ చేసి శిక్షించాలని సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదుఅయితే.. ఘటన జరిగి 10 రోజులవుతున్నా ఇంతవరకు నిందితుల్ని పట్టుకోని పోలీసులునిందితుల్లో నలుగురు అబ్బాయిలు సహా ఒక అమ్మాయి కూడా ఉందని సమాచారం

## ఇకపై 7 రకాల వడ్లకే బోనస్..!!



**తెలంగాణ : జూన్ 18,** 33 రకాల నుండి 26 రకాలను తొలగించిన కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ జాబితా నుండి ఉమ్మడి నల్గొండ ప్రాంతంలో పండించే చిట్టి ముత్యాలు, కావేరీ, జాయింట్ బీపీటీ, నెల్లూరు సన్నాలు ఔట్‌కేవలం బీపీటీ-5204 (సాంబమ సూరి), ఆర్ఎన్ఆర్-15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎ న్ఎం-1638 (కూనారం సన్నలు), డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి), కేఎన్ఎం-7715 రకాలకే బోనస్ ఎన్నికల ముందు అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి, ఎన్నికల తర్వాత కేవలం సన్న వడ్లకే పరిమితం చేసిన కాంగ్రెస్ పార్టీ సన్న వడ్లలో కూడా కనీసం 50% రైతులకు కూడా బోనస్ అందలేదని ఆరోపణలుఇప్పుడు మళ్లీ 7 రకాల వడ్లకే బోనస్ అని పరిమితులు పెట్టడం ఏంటని నిలదీస్తున్న రైతులు

# గన్‌పార్క్ వద్ద ఉద్రిక్తత.!

**– సచివాలయం ముట్టడికి జర్నలిస్టుల యత్నం..నిరసన అరెస్టు**






**ఆదాబ్ సైబరాబాద్, హైదరాబాద్ :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య, వివక్షపూరిత వైఖరికి నిరసనగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన "ఛలో హైదరాబాద్" కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. గన్‌పార్క్ నుంచి సచివాలయం ముట్టడికి బయలుదేరిన జర్నలిస్టులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు హైదరాబాద్‌కు చేరుకుని గన్‌పార్క్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అమర వీరుల స్థూపానికి ఫెడరేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అమరవీరుల స్థూపానికి వినతిపత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పన్నెండేళ్లు గడిచినా జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులను పాలకులు చిన్నచూపు చూడడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. చిన్న, మధ్య తరహా పత్రికలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రెండేళ్లుగా ప్రకటనల బిల్లులు చెల్లించక పోవడంతో అనేక పత్రికలు మూతపడే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులతో పాటు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, పెండింగ్ ప్రకటనల బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన పత్రికలను ఎంపానల్ చేయాలని కోరారు. జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం, ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు దాటిన జర్నలిస్టులకు పెన్షన్ అమలు చేయడంతో పాటు జర్నలిస్టుల సంక్షేమం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయించాలని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కూడా విజ్ఞప్తి చేశారు. అనంతరం జర్నలిస్టులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సచివాలయం వైపు ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని పంజాగుట్ట, ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్లకు తరలించారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని మామిడి సోమయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కో-కన్వీనర్లు బండి విజయ్ కుమార్, యాదగిరి, తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు చిత్రా శ్రీనివాస్, దామెర జగదీశ్వర్ గుప్తా, కే. పాండురంగారావు, పద్మనాభరావు, సామ్రాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, పలు జిల్లాల జర్నలిస్టు సంఘాల నాయకులు, జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సాలూరు ఆర్టీసీ డిపోలో యోగా కార్యక్రమం




**పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరు,జూన్ 18, :** జూన్ 21 వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం మరియు యోగాంధ్ర సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా ఏపీఎస్ఆర్టీసీ సాలూరు డిపోలో గురువారం ఉదయం యోగ కార్యక్రమాన్ని డిపో మేనేజర్ పి.ఆచారి ఆధ్వర్యంలో యోగా శిక్షకులు శ్రీ రామ యోగ సేవా సంస్థ ప్రతినిధి ప్రసాద్ మాస్టర్ , శ్రీ సత్యసాయి ధ్యాన మండలి ప్రతినిధులు బాలాజీ , సూర్యనారాయణ , శ్రీను , వెంకటరమణ చే ఆర్టీసీ ఉద్యోగులకు యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరంతరం ఒత్తిడితో పనిచేసే ఆర్టీసీ ఉద్యోగులు ప్రతిరోజు యోగా చేయుట వలన శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందుతూ మరింత ఉత్సాహంగా ఉద్యోగం చేసేందుకు ఉపయోగపడుతుందని యోగా శిక్షకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు కండక్టర్లు, మెకానికల్ సిబ్బంది, ట్రాఫిక్, మెకానికల్ సూపర్వైజర్లు, యూనియన్ ప్రతినిధులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఐపీఎస్ సునీల్ కుమార్‌పై ఏపీ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు




**అమరావతి, జూన్ 18 :** ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు (గురువారం) విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్ సభ్యుడిపై కస్టోడియల్ టార్చర్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఐపీఎస్ అధికారికి ముందస్తు బెయిల్ రక్షణగా మారకూడదని స్పష్టం చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయస్థానం పిటిషనర్‌ను ఉద్దేశించి 'ఎప్ప టిలోగా సరెండర్ అవుతారు?' అని ప్రశ్నించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధిపై కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని న్యాయస్థానం పేర్కొంది. పార్లమెంట్‌పై దాడి చేసిన వ్యక్తులకు, ఒక పార్లమెంట్ సభ్యుడిని కస్టడీలో వేధించిన వారికి మధ్య పెద్ద తేడా లేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సంఘటనల్లో పాల్గొనకుండా ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి తనను తాను నియంత్రించుకోవాల్సిన బాధ్యత ఉందని వ్యాఖ్యానించింది. ఎంపీని వేధింపులకు గురిచేయబోతున్నారని సునీల్ కుమార్ నాయక్‌కు ముందే తెలుసునని హైకోర్టు తెలిపింది. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని పేర్కొంది. అందువల్ల ఆయన స్వచ్ఛందంగా వెళ్లి పోలీసుల ఎదుట సరెండర్ కావడం మంచిదని హైకోర్టు సూచించింది. ముందస్తు బెయిల్ కోరుతూ కొనసాగాలా.?, లేక సరెండర్ అయ్యే మార్గాన్ని ఎంచుకోవాలా.? అనే విషయంపై నిర్ణయం తీసుకుని కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించింది. సునీల్ కుమార్ నాయక్ తరఫు న్యాయవాది స్పందిస్తూ, పిటిషనర్‌తో సంప్రది ంచి తదుపరి నిర్ణయాన్ని హైకోర్టుకు తెలియ జేస్తామని అన్నారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను వాదనలు వినిపిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తుది నిర్ణయం తీసుకోకుండా, ఈ కేసు విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.

# చకచకా అమరావతి నిర్మాణ పనులు విధ్వంసం నుంచి విశ్వనగరిగా!


**అమరావతి:** ఐదు సంవత్సరాలు జగన్ ప్రభుత్వ కబంధ హస్తాల్లో నలిగిన అమరావతి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఊపిరి పీల్చుకుంది. జగన్ ప్రభుత్వ విధ్వంసకాండ పర్యవసానాల్ని అధిగమించేందుకు కొంత సమయం పట్టినా వాటన్నింటినీ దాటుకుని అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే రాజధాని నిర్మాణాన్ని పట్టాలెక్కించింది. అమరావతికి కేంద్రం అండగా నిలవడం, ఆర్థికంగానూ చేయూతనివ్వడంతో 2028 నాటికి ప్రభుత్వ భవనాలు, ప్రధాన మౌలికవసతుల నిర్మాణం పూర్తిచేయాలన్న కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉంది. రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ కేంద్రం చట్టసవరణ చేయడం కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద విజయం. పెట్టుబడులకు ఆకర్షణగా: ఇప్పటివరకు రూ.66,073 కోట్ల పనులకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. వాటిలో రూ.63,396 కోట్ల పనులకు టెండర్లు ముగిశాయి. రూ.56,386 కోట్ల పనులు మొదలయ్యాయి. అంతర్జాతీయ క్రీడానగరం, స్మార్ట్ పరిశ్రమలు, ఇన్నర్ రింగ్‌రోడ్డు, రైల్వేస్టేషన్, విమానాశ్రయం లాంటి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం మలిదశ భూసమీకరణ ప్రారంభించింది. ఏడు గ్రామాల పరిధిలో 16,666 ఎకరాలు సమీకరిస్తోంది. ప్రైవేటు పెట్టుబడుల ఆకర్షణకూ ప్రయత్నిస్తోంది. బిట్స్ పిలానీ లాంటి ప్రఖ్యాత విద్యాసంస్థలు వచ్చాయి. అధికారంలోకి వచ్చేనాటికి - అమరావతి అస్తవ్యస్తం: వైఎస్సార్సీపీ



ప్రభుత్వం అమరావతిపై కక్షగట్టింది. జగన్ అధికారంలోకి రాగానే రాజధాని పనులు నిలిపేశారు. అప్పటికే రూ.10 వేల కోట్ల పనులు జరిగాయి. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంసానికి తెరతీశారు. స్టార్టప్ ప్రాంత అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టిన సింగపూర్ కన్సార్షియంను బెదిరించి వెళ్లగొట్టారు. రాజధానికి రూ.3,500 కోట్ల ప్రపంచబ్యాంకు రుణం ఇచ్చేందుకు 2019 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీ హయాంలో అంతా సిద్ధమవ్వగా జగన్ దిల్లీ వెళ్లి రుణం అక్కర్లేదని అడ్డుపుల్ల వేశారు. మూడు రాజధానుల ప్రతిపాదనతో మూడు ముక్కలాటకు తెరతీశారు. శాసనసభను అమరావతిలో ఉంచి రాజధానిని విశాఖకు తరలించేందుకు కుట్రపన్నారు. భారీ నిర్మాణాలకు అమరావతి పనికిరాదని, వర్షాలకు మునిగిపోతుందని అప్పటి మంత్రులు, వైఎస్సార్సీపీ నాయకులు విషప్రచారం చేశారు. అమరావతి శ్మశానమని, ఎడారి అని నోరు పారేసుకున్నారు. అమరావతి రైతుల ఉద్యమాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని చూశారు. పాదయాత్ర చేస్తున్న రైతులపైకి పోలీసులను, అల్లరి మూకలను ఉసిగొల్పారు. అమరావతి మాస్టర్‌ప్లాన్‌ను దెబ్బతీసేందుకు ఆర్-5 జోన్‌ని సృష్టించి బయటి ప్రాంతాలకు చెందిన 50వేల మందికి సెంటు చొప్పున ఇళ్లపట్టాలు ఇచ్చారు. అమరావతి నుంచి మంగళగిరి, తాడేపల్లి మండలాల గ్రామాల్ని తప్పించారు. మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ ఏర్పాటుచేసి, ఆ గ్రామాలను దానిపరిధిలో చేర్చారు. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని హైకోర్టు ఆదేశించినా జగన్ ప్రభుత్వం కుట్రలు ఆపలేదు. సచివాలయం టవర్ల పునాదులు ఐదేళ్లూ నీళ్లలోనే ఉన్నాయి. అమరావతి చిట్టడవిని తలపించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో వేగంగా పనులు: వైఎస్సార్సీపీ ప్రభుత్వం సృష్టించిన అన్నిరకాల అవరోధాలను అధిగమించేందుకు, ఐదేళ్లపాటు నీళ్లలో నానిన ఐకానిక్ టవర్ల పునాదుల పటిష్ఠతను నిపుణులతో మదింపు లాంటి ప్రక్రియలను పూర్తి చేసేందుకు 8 నెలలు పట్టింది. తర్వాత నాలుగు నెలల్లో మెజారిటీ పనులకు టెండర్లు పిలిచింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిన అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను కూటమి అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే పునరుద్ధరించింది. కూటమి అధికారంలోకి వచ్చాక రాజధానిలో పెట్టుబడులకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. ఈ రెండేళ్లలో 112 సంస్థలకు 1,272.80 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఆయా సంస్థలు రూ.30 వేల కోట్లు పెట్టుబడులు పెడతాయని, 65 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. బిట్స్ పిలానీ, ఎక్స్‌ఎల్ఆర్ఐ, నేషనల్ లా యూనివర్సిటీ లాంటి ప్రముఖ విద్యాసంస్థలకు భూములు కేటాయించింది. అమరావతిలో 50 ఎకరాల్లో క్వాంటమ్ వ్యాలీని అభివృద్ధి చేస్తోంది. డిసెంబరు నాటికి ఐబీఎం క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం. చివరిదశలో మంత్రుల బంగళాల నిర్మాణం: ఏపీ ఎన్ఆర్టీ సొసైటీ ఆధ్వర్యంలో రూ.600 కోట్లతో ఐకానిక్ టవర్ల నిర్మాణం వేగంగా జరుగుతోంది. పరిపాలన నగరంలో సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయ టవర్ల నిర్మాణం జరుగుతోంది. హైకోర్టు, శాసనసభ భవన నిర్మాణాలు మొదలయ్యాయి. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ఏఐఎస్ అధికారుల టవర్లు దాదాపు సిద్ధమయ్యాయి. మంత్రుల బంగళాల నిర్మాణం చివరిదశలో ఉంది. హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వ కార్యదర్శుల బంగళాలు, గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగుల భవనాల నిర్మాణం జరుగుతోంది. మరో ఏడాదిలో ఇవన్నీ సిద్ధమవుతాయి.

# 'యోగాంధ్ర' నిర్వహణపై సీఎం సమీక్ష - 1.33 లక్షల సెంటర్లలో అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్లు

**అమరావతి:** రాష్ట్ర ప్రగతి రథానికి సరికొత్త దిశానిర్దేశం చేస్తూ అన్నదాతకు అండగా, ప్రజారోగ్యానికి అభయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమీక్షలు నిర్వహించారు. ఎల్‌నినో ముప్పును తట్టుకునేలా వ్యవసాయ రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేస్తూ ప్రకృతి సేద్యం, పప్పుధాన్యాల సాగుపై కీలక ఆదేశాలు జారీ చేశారు. 'యోగాంధ్ర' నినాదంతో ప్రతి ఇంటికీ ఆరోగ్యాన్ని చేరవేసేలా, అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని చారిత్రాత్మక విజయవంతం చేయాలని యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ అనుబంధ రంగాలు, యాగాంధ్ర నిర్వహణ పై విడివిడిగా సమీక్షించారు. ఎల్‌నినో సృష్టించే ప్రత్యేక వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేలా రాష్ట్రంలో పంటల సాగు విధానంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. గత ఏడాది ఎదురైన అనుభవాలను గుణపాఠాలుగా మార్చుకుని, రైతులకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయ పంటల మార్పిడి విధానాలపై వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేశారు.



రాష్ట్రవ్యాప్తంగా రైతులు పెద్దఎత్తున ప్రకృతి సేద్యం వైపు మళ్లేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు.'సర్టిఫికేషన్' ప్రక్రియపై రైతుల్లో అవగాహన : అంతర్జాతీయ మార్కెట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌ను అందిపుచ్చుకునేలా 'సర్టిఫికేషన్' ప్రక్రియపై రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ఇందుకోసం తాను స్వయంగా రంగంలోకి దిగుతానని స్పష్టం చేశారు. మిర్చి, పొగాకు, తోతాపురి మామిడి రైతులకు మేలు జరిగేలా శాస్త్రీయ విధానాలను అమలు చేయాలని సీఎం సూచించారు. ముఖ్యంగా పొగాకు కొనుగోలు దారులతో తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని మార్కెట్‌లో గిట్టుబాటు ధర వచ్చే వరకు రైతులు తమ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకునే అవకాశాలను పరిశీలించాలన్నారు. మార్కెట్లో విపరీతమైన డిమాండ్ ఉన్న పప్పు దినుసుల సాగును ప్రోత్సహించడం ద్వారా రైతులకు లాభాలు తెచ్చిపెట్టాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటల స్థితిగతులను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు అదనపు విలువ జోడించేలా చర్యలు తీసుకోవాలన్నా రు. ఆక్వా రైతులు, అసోసియేషన్ ప్రతినిధులతో పాటు ఆక్వా ఫీడ్ తయారీదారులతో త్వరలోనే ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు .1.33 లక్షల సెంటర్లలో యోగా డే : ప్రజారోగ్యమే మహాభాగ్యమనే సంకల్పంతో 'సంజీవని' కార్యక్రమం ద్వారా యోగాను రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. 'ఇంటింటికీ యోగా' అనే ప్రధాన థీమ్‌తో ఏడాది పొడవునా ప్రత్యేక కార్యాచరణను అమలు చేసి, ఏపీని 'యోగాంధ్ర'గా యోగా దినోత్సవానికి ఏపీ మునుపెన్నడూ లేని విధంగా సిద్ధమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల సెంటర్లలో యోగా డే నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి కాగా ఈ వేడుకల్లో పాల్గొనేందుకు ఇప్పటికే రికార్డు స్థాయిలో కోటి మందికి పైగా ప్రజలు రిజిస్ట్రేషన్ చేసుకోవడం విశేషమని తీసుకెళ్లారు.'యోగాఏడెస్టినేషన్' వార్షిక కేలండర్ : ఈ ఏడాది యోగా దినోత్సవ వేడుకలకు అంతర్జాతీయ వేదికపై ప్రత్యేక పురస్కారాలు అందిస్తామని సీఎం ప్రకటించారు. జూన్ 21న ఏడాది పొడవునా సాగే 'యోగాఏడెస్టినేషన్' వార్షిక కేలండర్‌ను కూడా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా విడుదల చేయనున్నారు.

# విశాఖలో భారీ అగ్నిప్రమాదం - ఫైర్ వర్క్స్ దుకాణంలో చెలరేగిన మంటలు

**విశాఖ:** కొత్త గాజువాకలోని ఓ ఫైర్ వర్క్స్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. రద్దీగా ఉండే మార్కెట్ రోడ్డులోని శివ ఫైర్‌వర్క్స్ షాపులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు దట్టమైన పొగలు అలుముకున్నాయి. దుకాణం నుంచి భారీగా పొగలు ఎగసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటల చెలరేగిన దుకాణం వద్దే విద్యుత్ స్తంభం ఉండటంతో ప్రమాద తీవ్రత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమైంది. అయితే సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకున్నారు. ఫైర్ సిబ్బంది సహాయంతో మంటలను అదుపులోకి తీసుకు వచ్చే ప్రయత్నాలు చేపట్టారు. ఈ సందర్భంగా జనం పెద్దఎత్తున గుమిగూడారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసే దృశ్యాలను తమ సెల్‌ఫోన్లలో బంధించారు. పోలీసుల రంగంలోకి దిగి పరిస్థితిని అదుపులోకి



తీసుకొచ్చారు. ఈ ఘటనపై విశాఖ సౌత్ ఏసీపీ శ్రీనివాస్ స్పందిస్తూ కీలక వివరాలు వెల్లడించారు. సదరు 'శివ ఫైర్ వర్క్స్' దుకాణానికి పోలీసుల నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఆయన స్పష్టం చేశారు. గతంలో అనుమతి నిరాకరించినప్పటికీ, యజమాని కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకున్నట్లు తెలిపారు. జనావాసాలు, వ్యాపార కూడళ్లు ఉన్న రద్దీ ప్రాంతాలలో ఇలాంటి ప్రమాదకర పేలుడు పదార్థాలను విక్రయించడం చట్టవిరుద్ధమని, నిబంధనలు ఉల్లంఘించిన షాపు యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు.

# కర్నూలులో రెచ్చిపోయిన వైఎస్సార్సీపీ మూకలు - టీడీపీ కార్యకర్తపై కర్రలు, రాళ్లతో దాడి



**కర్నూలు :** ఏపీలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉన్నా, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తల దౌర్జన్యం, వారి తీరు, వారి రౌడీయిజం మాత్రం ఏమాత్రం తగ్గడం లేదు. వారి అక్రమాలు, దౌర్జన్యాలు, అన్యాయాలను ఎత్తి చూపిస్తున్న వారిపై, ప్రశ్నించిన వారిపై దాడులకు పాల్పడటం ఇంకా కొనసాగుతునే ఉన్నాయి. తాజాగా కర్నూలు నగరంలో రాజకీయ ఉద్రిక్తతలకు దారితీసే ఘటన చోటు చేసుకుంది. తెలుగుదేశం పార్టీ కార్యకర్త తైజుం భాషపై వైఎస్సార్సీపీ వ్యక్తులు అర్ధరాత్రి దాడి చేసిన ఘటన కలకలం రేపింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బాషా ప్రస్తుతం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిరాణా దుకాణం నుంచి వస్తుండగా దాడి : కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, తైజుం బాషా ఇంటి నుంచి సమీపంలో ఉన్న కిరాణా దుకాణానికి వెళ్లాడు. అక్కడి నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా మాటువేసిన వైఎస్సార్సీపీ కార్యకర్తలు అతనిపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. కర్రలతో పాటు రాళ్లతో కూడా విచక్షణారహితంగా కొట్టడంతో బాషా తీవ్రంగా గాయపడ్డాడని తెలిపారు. దాడి సమయంలో బాషా శరీరంపై పలుచోట్ల తీవ్రంగా గాయాలయ్యాయని, రక్తస్రావం కూడా ఎక్కువగా జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. హత్యాయత్నంగా ఫిర్యాదు : దాడి జరిగిన వెంటనే బాషాను కుటుంబ సభ్యులు, స్థానికులు కలిసి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని విద్యార్థులకూ విద్యాకానుక కిట్లు

**అమరావతి:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 430 కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న లక్షకు పైగా విద్యార్థినిల కోసం తక్షణమే 53,180 బంక్ బెడ్స్(ఒకే మంచం ఫ్రేమ్ పైన మరొకటి అమర్చబడి ఉండే రెండు అంతస్తుల పడకలు) ఏర్పాటు చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖపై నిర్వహించిన సమీక్షలో అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'పీఎంశ్రీ' నిధుల వినియోగంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందని వెల్లడించారు. కడప మోడల్‌ను ఆదర్శంగా తీసుకుని ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 844 స్మార్ట్ కిచెన్ల నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే 2 లక్షల మందికి పైగా విద్యార్థులకు కూడా విద్యా కానుక కిట్ల పంపిణీ చేపడుతున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రైవేట్ అన్-ఎయిడెడ్ స్కూళ్ల అనుమతుల్లో అనవసర



నిబంధనలు తొలగించాలని, స్కూల్ ఫీజుల వివరాలను బోర్డులపై, పబ్లిక్ డొమైన్‌లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. బ్యాంక్ అకౌంట్ల లో శాశ్వత డిపాజిట్లు : అనాథ పిల్లలకు 'తల్లికి వందనం' పథకం నిధులు నేరుగా అందేలా కలె క్టర్ల ద్వారా పక్కా విధానాన్ని, వారి భవిష్యత్తు కోసం బ్యాంక్ అకౌంట్లలో శాశ్వత డిపాజిట్ ఆలోచనను మంత్రి లోకేశ్ తెరపైకి తెచ్చారు. తెలుగు అకాడమీ ముద్రించే పాఠ్యపుస్తకాలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచేం దుకు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ ప్లాట్‌ఫార్మ్స్ ద్వారా ఆన్‌లైన్ విక్రయాలు ప్రారం భించాలన్నారు. విద్యార్థుల పాఠశాల హాజరు శాతం 95 శాతం తగ్గకుండా చూడాలన్నారు. ముఖ్యంగా కర్నూలు, అనంతపురం సహా ఐదు వెనుకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. మ్యాథ్స్, సైన్స్‌తో పాటు మాతృభాష తెలుగులో విద్యార్థులు విఫలం కాకుండా బ్రిడ్జి కోర్సు మెటీరియల్ తయారుచేసి, వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని మంత్రి లోకేశ్ తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యతలో ఎక్కడా రాజీ పడకూడదని స్పష్టం చేస్తూ, హైస్కూల్ విద్యార్థులకు వీలైనంత త్వరగా 'క్రోమ్ బుక్స్'తో కూడిన కంప్యూటర్ ల్యాబ్స్ అందించాలని లోకేశ్ దిశానిర్దేశం చేశారు. రాబోయే మెగా పీటీఎం నాటికి 'సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర' కిట్ల పంపిణీని 100 శాతం పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన గడువు విధించారు. చేరికలను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ : అదేవిధంగా విద్యాశాఖ అధికారులతో నిన్న(మంగళవారం) నిర్వహించిన సమీక్ష సమావేశంలో పలు అంశాలపై మంత్రి లోకేశ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. అలాగే ఎప్‌సెట్, పాలిసెట్, ఆర్‌సెట్ తదితర 12 రకాల ప్రవేశ పరీక్షల కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇబ్బందులు కలగకుండా కౌన్సెలింగ్ తేదీలను సమయానుకూలంగా ప్రకటించాలని చెప్పారు. ఆ కళాశాలల్లో సీట్ల పెంపుపై పరిశీలన : రాష్ట్రంలోని ప్రభుత్వ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపుపై పరిశీలన చేయాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో మెకానికల్, సివిల్ కోర్సులకు మంచి డిమాండ్ ఉందని అధికారులు వివరించారు. ఇంజినీరింగ్ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# మహిళలను కించపరిస్తే రాజకీయ భవిష్యత్తు ఉండదు

**ప్రకాశం, జూన్ 18 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో మహిళలను వైసీపీ నాయకులు చిన్నచూపు చూస్తున్నారని ధ్వజమెత్తారు. మహిళలను అవహేళన చేస్తున్నారని మండిపడ్డారు. మహిళలను కించపరిస్తే రాజకీయ భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. (గురువారం) ప్రకాశం జిల్లాలో మంత్రి ఆనం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల గురించి వైసీపీ నేతలు అవహేళనగా మాట్లాడటం చాలా బాధాకరమని అన్నారు.



మహిళలను కించపరిస్తే ఏ పార్టీ మనుగడ సాధించలేదని చెప్పుకొచ్చారు. రామరాజ్య స్థాపనకు ఎన్డీఏ కూటమి పనిచేస్తోంది..తమ ప్రభుత్వంలో సంక్షేమాన్ని ఒకవైపు.. మరోవైపు అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తున్నామని మంత్రి ఆనం వ్యాఖ్యానించారు. రామరాజ్య స్థాపనకు ఎన్డీఏ కూటమి పనిచేస్తోందని పేర్కొన్నారు. జగన్ హయాంలో దైవానికి కూడా విలువ లేకుండా చేశారని ఆగ్రహించారు. ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ అనే సంకల్పంతో ముందుకెళ్తున్నామని వివరించారు. కూటమి ప్రభుత్వంలో హిందూ ధర్మంతో పాటు అన్ని మతాలకు సమానమైన ప్రాతిపదిక కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులకు ప్రాధాన్యం..హిందూ, ముస్లిం, క్రైస్తవులకు సీఎం చంద్రబాబు ప్రాధాన్యం కల్పిస్తున్నారని మంత్రి ఆనం తెలిపారు. ఏపీలో ఆలయాల పునర్నిర్మాణం కోసం రూ.50 కోట్ల 45 లక్షలు కేటాయించామని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 30 ఆలయాల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామని చెప్పుకొచ్చారు. 15 సెంట్ల భూమి ఉంటే ఆలయ నిర్మాణానికి రూ.30 లక్షలు ఇస్తామన్నారు. ప్రతి ప్రాంతంలో ఒక ఆలయం ఉండాలని ఆకాంక్షించారు. తమ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి, ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్ కోసం కృషి చేస్తోందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు

# అభివృద్ధిలో కొత్త శిఖరాలను అధిరోహిస్తున్న కృష్ణా జిల్లా




**అమరావతి, జూన్ 18:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కృష్ణా జిల్లా అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహకారంతో సంక్షేమం - అభివృద్ధిని సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కృష్ణా జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ కింద 1.33 లక్షల రైతు కుటుంబాలకు రూ.252.94 కోట్ల పెట్టుబడి సాయం అందించామని తెలిపారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించేందుకు 29 కిసాన్ డ్రోన్లను సబ్సిడీపై అందించామన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని మంత్రి తెలిపారు. పశుసంవర్ధక రంగంలో ఇంటి వద్దకే పశువైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పరిశ్రమల రంగంలో కృష్ణా జిల్లా విశేష పురోగతి సాధించిందని చెప్పుకొచ్చారు.

# ఏడాదిలో రూ.660 కోట్ల విరాళాలురూ.256 కోట్ల వడ్డీ ఆదాయం- భారీగా పెరిగిన శిర్డీ సాయిబాబా ఇన్‌కమ్

**శిర్డీ :** దేశ విదేశాల్లోని లక్షలాది మంది సాయి భ క్తుల అచంచల విశ్వాసం కారణంగా శిర్డీ సాయిబాబా సంస్థాన్ ఆర్థిక పరిస్థితి గణనీయంగా బలపడింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సాయిబాబా సంస్థాన్ నగదు, డిజిటల్, వస్తు రూపంలో మొత్తం సుమారు రూ.660 కోట్ల విరాళాలను స్వీకరించింది. అదనంగా సంస్థాన్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు రూ.3,618 కోట్లకు చేరుకోగా, కేవలం వడ్డీ ద్వారానే రూ.256 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది కాలంలో సాయిబాబా ఆశీస్సులు పొందేందుకు 3 కోట్లకు పైగా భక్తులు శిర్డీని సందర్శించారు.భక్తుల విం ాళాలు, పెరుగుతున్న డిజిటల్ చెల్లింపులు, సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ కారణంగా శిర్డీ సాయిబాబా సంస్థాన్ ఆర్థిక పునాది మరింత దృఢంగా మారుతోందని ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థాన్ మొత్తం రూ.638 కోట్ల ఆర్థిక విరాళాలను పొందింది. అంతేకాకుండా సుమారు రూ.28 కోట్ల విలువైన వస్తు రూప కానుకలను అందుకుంది. సాయిబాబా సంస్థాన్ నిర్వహించే ఆస్పత్రుల కోసం భక్తులు సుమారు రూ.15కోట్లు- రూ.20 కోట్ల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను కూడా విరాళంగా ఇచ్చారుహుండీ, కౌంటర్ల ద్వారా రూ.195.24 కోట్ల ఆదాయం శిర్డీ సాయిబాబా



సంస్థాన్‌కు చేకూరింది. యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులు, చెక్కులు, డీడీల ద్వారా రూ.122.38 కోట్ల విరాళాలు అందాయి. సాయి బాబా విదేశీ భక్తులు రూ.4.89 కోట్ల విలువైన ఫారిన్ కరెన్సీని విరాళంగా ఇచ్చారు. దర్శనం, హారతి ప్రవేశ రుసుముల ద్వారా రూ.39.55 కోట్ల ఆదాయం సమకూరింది. డిజిటల్ లావాదేవీల పట్ల ఆసక్తి పెరుగుతుండటంతో ఆన్‌లైన్ విరాళాలలో స్థిరమైన పెరుగుదల కనిపిస్తోంది. సాయిబాబా సంస్థాన్ ఆర్థిక బలానికి ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ కీలక పాత్ర పోషిస్తోంది. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు ఈ సంస్థ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ ద్వారానే రూ.256.69 కోట్ల ఆదాయాన్ని పొందింది. వివిధ జాతీయీకరించిన బ్యాంకుల్లో సంస్థాన్‌కు రూ.3,618.56 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. వార్షిక ఖర్చులు పోనూ మిగిలిన నిధులను తిరిగి ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెట్టడం వల్ల ఈ నిధి నిరంతరం పెరుగుతూ వస్తోంది. అలాగే భక్తులు సమర్పించిన విలువైన బంగారం, వెండి నిల్వల్లో కూడా ఈ ఏడాది గణనీయమైన పెరుగుదల నమోదైంది. 2026 జూన్ 15 నాటికి సంస్థాన్ వద్ద సుమారు రూ.151.87 కోట్ల విలువైన 549.44 కిలోల బంగారం, సుమారు రూ.25.33 కోట్ల విలువైన 7,030.47 కిలోల వెండి నిల్వలు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భక్తులు సాయి పాదాల చెంత 16 కిలోల బంగారం, 197 కిలోల వెండిని సమర్పించారు.ఈ విరాళాలు దేనికి ఖర్చు చేస్తారంటే?సాయి భక్తుల నుంచి స్వీకరించిన విరాళాలను సంస్థాన్ వివిధ సామాజిక ప్రయోజనకరమైన, ప్రజా సంక్షేమ కార్యక్రమాల కోసం వినియోగిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మౌలిక సదుపాయాలు, ఆస్పత్రులు, ఆరోగ్య సంరక్షణ సేవలు, ఆసియాలోనే అతిపెద్ద ఉచిత ప్రసాదాలయం నిర్వహణ, విద్యుత్ ఖర్చులు, సిబ్బంది, కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు, యాత్రికుల వసతి సౌకర్యాలు, విద్య, ఇతర ప్రజా ప్రయోజన పథకాల కోసం సంస్థ మొత్తం రూ.552.33 కోట్లు ఖర్చు చేసింది.శిర్డీ సాయినాథుడు బోధించిన అన్నదానం, సేవాభావం, మానవతా దృక్పథం వంటి విలువలను సంస్థాన్ సమర్థవంతంగా పాటిస్తోందని సాయిబాబా సంస్థాన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) గోరక్ష గదిల్కర్ తెలిపారు. భక్తుల నుంచి స్వీకరించిన విరాళాలను రోగుల సంరక్షణ, విద్య, యాత్రికుల వసతి, వివిధ మౌలిక సదుపాయాల కల్పన కోసం వినియోగించడం వల్ల శిర్డీ ఆధ్యాత్మిక, సామాజిక ప్రాముఖ్యం మరింత పెరుగుతోందన్నారు. కోట్ల మంది సాయి భక్తుల విశ్వాసంపై ఆధారపడి నడుస్తున్న ఈ సంస్థాన్ వార్షిక ఆర్థిక లావాదేవీలు రూ.850 కోట్లకు పైగా చేరాయని వెల్లడించారు. పెరుగుతున్న విరాళాలు, విస్తృతమైన సామాజిక సేవా కార్యక్రమాలతో సాయిబాబా సంస్థాన్ దేశంలోనే అత్యంత సమర్థవంతమైన, ప్రభావవంతమైన మతపరమైన సంస్థల్లో ఒకటిగా ఎదుగుతోందని సంతోషం వ్యక్తం చేశారు.

# కస్టోడియల్ మరణాలపై మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు

**ఇండోర్:** కస్టోడియల్ మరణాలపై మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. నిందితులను కస్టడీలో కొట్టి చంపడం పోలీసుల 'అధికారిక విధి' కాదని తేల్చి చెప్పింది. నిందితులైన పోలీసులను శిక్షించేందుకు ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు ఇండోర్ జిల్లా కోర్టు ఉద్యోగి పంకజ్ వైష్ణవ్ కస్టోడియల్ డెత్ కేసులో పోలీసుల పిటిషన్‌ను కొట్టివేస్తూ జస్టిస్ గజేంద్ర సింగ్ సంచలన ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కస్టోడియల్ మరణాలపై హైకోర్టు ధర్మాసనం ఘాటు వ్యాఖ్యలు చేసింది. కస్టోడియల్ మరణాలు సభ్య సమాజంలో అత్యంత ఘోరమైన నేరాలని మధ్యప్రదేశ్ హైకోర్టు అభిప్రాయపడింది. థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, రికార్డులు ఫోర్జరీ చేయడం పోలీసుల విధి నిర్వహణ కిందికి రావని ఈ సందర్భంగా పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగుల ముందస్తు అనుమతి నిబంధన ఈ కేసులో వర్తించదని వెల్లడించింది. భోపాల్ ఎయిమ్స్ ఆస్పత్రి పోస్టుమార్టం నివేదికలో బాధితుడిపై పోలీసుల హింస నిజమేనని తేలిందని కోర్టు ప్రస్తావించింది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే పోలీసులకు రక్షణ కవచాలు ఉండవని స్పష్టం చేసింది. విచారణకు ముందస్తు అనుమతి అవసరం లేదన్న కోర్టు తీర్పుతో నిందితులైన పోలీసులపై



విచారణకు మార్గం సుగమమైంది.ఇండోర్‌లోని జిల్లా కోర్టులో క్లాస్-IV ఉద్యోగిగా పంకజ్ వైష్ణవ్ (24) పని చేసేవారు. 2015 డిసెంబర్‌లో ఓ స్కూటర్ దొంగతనం చేసినట్లు వైష్ణవ్‌పై ఆరోపణలు వచ్చాయి. ఈ మేరకు డిసెంబర్ 19న ఇండోర్‌లోని ఎంఐజీ పోలీస్ స్టేషన్‌కు అతన్ని తీసుకెళ్లారు. అదే రోజు రాత్రి పోలీసుల అదుపులో ఉండగానే వైష్ణవ్ ప్రాణాలు కోల్పోయాడు. విచారణ సందర్భంగా వైష్ణవ్‌ను పోలీసులు విపరీతంగా కొట్టడంతోనే మృతిచెందినట్లు ఆరోపణలు గుప్పుమన్నాయి. ఈ కేసు సంచలనం సృష్టించగా.. సీఐడీ అధికారులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఛత్తీస్‌గఢ్‌లో దారుణం.. మైనింగ్ గొడవల్లో స్థానిక నేత సజీవ దహనం


**ఛత్తీస్‌గఢ్:** ఇసుక తవ్వకాలకు సంబంధించి ఇరు వర్గాల మధ్య చెలరేగిన వివాదం దారుణ మలుపు తిరిగింది. స్థానిక నేత, జన్‌పద్ పంచాయతీ మాజీ ప్రెసిడెంట్ భరత్ సింగ్ సజీవదహనమయ్యారు. కొరియా జిల్లాలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ కేసులో పోలీసులు ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్టు చేశారు.జాతీయ మీడియా కథనాల ప్రకారం, స్థానికంగా ఇసుక తవ్వకాల కాంట్రాక్ట్‌ను భరత్ సింగ్ దక్కించుకున్నారు. ఈ క్రమంలో మనోజ్ త్రిపాఠీ వర్గంతో భరత్ సింగ్‌కు వివాదం మొదలైంది. ఇసుక తవ్వకాల కోసం వాడే టిప్పర్ ట్రక్‌లు త్రిపాఠీ కుటుంబానికి చెందినవని స్థానికులు తెలిపారు. దీంతో, ఇసుక తరలింపు, చెల్లింపుల విషయంలో భరత్ సింగ్, త్రిపాఠీ వర్గాల మధ్య వివాదం మొదలైంది. చివరకు ఇది ఆధిపత్య పోరుగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మంగళవారం రాత్రి ఇసుక తవ్వకాలకు సంబంధించి తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు భరత్ సింగ్ నౌగెయిన్ గ్రామానికి వెళ్లారు. దీంతో, అక్కడ వివాదం చెలరేగగా



భరత్ సింగ్ ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ కారును కొందరు అడ్డగించారు. తప్పించుకునే వీలులేకుండా కారుకు ముందు, వెనుక లారీలను అడ్డుపెట్టారు. ఆ తరువాత కారుపై పెట్రలో పోసి నిప్పటించడంతో భరత్ సింగ్ సజీవదహనమ య్యారు. భరత్ సింగ్‌తో పాటు కారులో ఉన్న విరేంద్ర సింగ్, నాగేంద్ర సింగ్ కూడా కాలిన గాయాలతో కన్నుమూ శారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన మయాంక్ సింగ్ పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది.ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని మృతుల కుటుంబం డిమాండ్ చేసింది.

# 'మోదీ విదేశాంగ విధానానికి గట్టి ఎదురుదెబ్బ' ఇరాన్ అమెరికా డీల్‌పై కాంగ్రెస్ ఫైర్

**న్యూ ఢిల్లీ :**అమెరికా, ఇరాన్ ఒప్పందంపై సంతకాలు జరి గిన వేళ ప్రధాని మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది. ఇది మోదీ విదేశాంగ విధా నానికి గట్టి ఎదురుదెబ్బ అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. ఈ ఒప్పందంతో అంతర్జాతీయ స్థాయిలో పాకిస్థాన్ ప్రాబల్యం పెరిగిందన్నారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని అధికారికంగా "ఇస్లామాబాద్ మీెఖ"గా పిలవడం పాక్ సాధించిన నూతన ప్రాంతీయ, అంతర్జాతీయ పలుకుబడికి నిదర్శమని చురకలు వేశారు.2008 ముంబయి ఉగ్రదాడి తర్వాత అప్పటి ప్రధాని మన్మోహన్ ప్రపంచ వేదికపై పాక్‌ను ఏకాకిని చేశారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. కానీ ఇప్పుడు పశ్చిమాసియా భౌగోళిక, భద్రత వ్యవహారాల్లోకి పాక్ మరింత లోతుగా చొచ్చుకుపోయిందన్నారు. ఇది భారత్ భద్రతపై తీవ్ర ప్రభావం చూపుతుందని జైరాం రమేశ్ హెచ్చరించారు. ఈ ఒప్పందం



ఇజ్రాయెల్‌కు స్పష్టమైన ఓటమి అని చెప్పారు. కానీ ఇజ్రాయెల్ పట్ల మోదీ ప్రదర్శిస్తున్న అంధభక్తి వల్ల భారత్ భారీ మూల్యం చెల్లించుకుంటోందని జైరాం రమేశ్ ఆరోపించారు."ఇది ప్రధానమంత్రి మోదీ విదేశాంగ విధానానికి, శైలికీ తీవ్రమైన ఎదురుదెబ్బ. పాకిస్థాన్? ఇప్పుడు పశ్చిమ ఆసియా భౌగోళిక-రాజకీయ, భద్రతా వ్యవస్థలో మరింత లోతుగా పాతుకుపోయింది. దీనివల్ల భారతదేశానికి తీవ్రమైన, గొప్ప పరిణామాలు ఎదురవుతాయి. ఈ అవగాహన ఒప్పందం అక్షర రూపంలో, స్ఫూర్తితో నిలబడితే, అది ఒక పెద్ద ముందడుగు.కానీ ఇది ఇరుపక్షాల మధ్య అపార్థాల ఒప్పంద పత్రంగా మారే అవకాశం కూడా ఉంది. ప్రస్తుతానికి చెప్పగలిగేది ఒక్కటే, రానున్న 60 రోజులు కీలకమైనవి."- జైరాం రమేశ్?, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిఈ అవగాహన ఒప్పందం వల్ల ఇరాన్‌కు చాలా ముఖ్యమైన, ఊహించని ప్రయోజనాలు చేకూరాయని, దీని ద్వారా ఆ దేశం తన ప్రతిఘటనను, దృఢత్వాన్ని ప్రదర్శించిందని రమేశ్? అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌తో యుద్ధాన్ని ప్రారంభించిన అమెరికాకు ఈ ఒప్పందం ఒక తీవ్రమైన దెబ్బ అని రమేశ్? వాదించారు. అమెరికా పెట్టుకున్న లక్ష్యాలు నెరవేరలేదని కూడా ఆయన పేర్కొన్నారు. "సైనిక శక్తి పరిమితులు మరోసారి బట్టబయలయ్యాయి. ట్రంప్‌ను మోదీ బుజ్జగించడం కొనసాగించడం సిగ్గుచేటు, వాస్తవానికి దేశద్రోహం. నిన్న రాత్రి జరిగిన ట్రంప్-మోదీ ద్వైపాక్షిక సమావేశంపై విదేశాంగ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదికే దీనికి తాజా సాక్ష్యం" అని కాంగ్రెస్ నాయకుడు పేర్కొన్నారు.మరోవైపు ఇరాన్ ప్రతిదాడుల పూర్తి భారాన్ని మోసిన గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) దేశాలు ఈ ఒప్పందాన్ని జాగ్రత్తగా స్వాగతించాయి. కానీ సంబంధాలను పునరాలోచిస్తాయని ఆయన అన్నారు. లెబనాన్, గాజా, ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌తో సహా ఈ ప్రాంతంలో నెతన్యాహు చర్యలకు మోదీ మాత్రమే తన మద్దతులో స్థిరంగా ఉన్నారు. ఇజ్రాయెల్ పట్ల మోదీకి ఉన్న ఈ గుడ్డి భక్తి మన దేశానికి భారీ మూల్యం చెల్లించేలా చేస్తోందని ఆయన అన్నారు.

# శిందేవర్గంలో విలీనం చేయాలని లేఖ ఇచ్చిన రెబెల్ ఎంపీలు 9 మంది ఎంపీల్లో ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరు

కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్నట్లుగా శివసేన ఉద్ధవ్ ఠాక్రే వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు తిరుగుబాటు చేశారు. గురువారం దిల్లీలో జరిగిన శివసేన ఖదీ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి 9మంది ఎంపీల్లో అరవింద్ సావంత్, అనిల్ దేశాయ్, రాజాభావూ వాజేలతో పాటు పార్టీకి చెందిన ఏకైక రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్ మాత్రమే హాజరయ్యారు. విప్ జారీ చేసినప్పటికీ ఆరుగురు రెబెల్ ఎంపీలు నగేష్ ఆష్టికర్, సంజయ్ దేశ్‌ముఖ్, సంజయ్ జాదవ్, సంజయ్ దినపాటిల్, ఓంప్రకాష్ రాజేనింబాల్కర్, భావూసాహెబ్ వాక్‌చౌరేలు సమావేశానికి దూరంగా ఉన్నారు. వారు తమను ఏక్‌నాథ్ శిందే సారథ్యంలోని శివసేనలో విలీనం చేయాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఓ లేఖ సమర్పించినట్లు సంబంధితవర్గాలు తెలిపాయి. లోక్‌సభలో తమకు వేరుగా సీట్లు కేటాయించాలని వారు లోక్‌సభ స్పీకర్ కార్యాలయానికి లేఖ పంపినట్లు తెలిసింది. సంతకాల పరిశీలన జరుగుతున్నట్లు పేర్కొన్నాయి. విలీన ప్రక్రియ పూర్తి కావటానికి



కొన్నిరోజుల సమయం పడుతుందని సంబంధితవర్గాలు పేర్కొన్నాయి. ధ్రువీకరణ కోసం కొందరు ఎంపీలు స్వయంగా హాజరు కావాల్సి ఉంటుందని స్పీకర్ కార్యాలయం భావిస్తోంది. రాబోయే రోజుల్లో అది జరుగుతుందని భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.ఎంపీల సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా చర్యలుమరోవైపు ఆరుగురు ఎంపీల గౌర్హాజరుపై ఖదీ సేన ఎంపీ సంజయ్ రౌత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకాని ఎంపీల సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించా రు. వారికి 'షో-కాజ్' నోటీసు జారీ చేయనున్నా మని తెలిపారు. పార్లమెంటరీ సమావేశం ముగిసిన తర్వాత విలేకరులతో మాట్లాడిన ఆయన, తిరుగుబాటు ఎంపీలను ద్రోహులుగా అభివర్ణించారు. పార్టీ విప్?ను ఉల్లంఘించినం దున త్వరలోనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు."మా పార్లమెంటరీ పార్టీ కార్యాల యంలో లోక్‌సభ నేత అరవింద్ సావంత్, చీఫ్ విప్ అనిల్ దేశాయ్ గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ముగ్గురు లోక్‌సభ ఎంపీలు అరవింద్ సావంత్, రాజాభావు వాజే, అనిల్ దేశాయ్ పాల్గొన్నారు. సమావేశానికి హాజరు కాని సభ్యుల చర్యను పార్టీ విప్ ఉల్లంఘనగా పరిగణిస్తున్నాము. వారు పార్టీ ఆదేశాలను పాటించలేదు, అందుకే వారిపై చర్యలు తీసుకునే ప్రక్రియ మొదలైంది. వారికి షో-కాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరతాము. అలాగే వారి సభ్యత్వాన్ని రద్దు చేసే దిశగా అడుగులు వేస్తాము. వారు బుధవారం స్పీకర్‌ను కలిసి విలీనం గురించి చర్చించారు." అని ఎంపీ సంజయ్ రౌత్ అన్నారు.షోకాజ్ నోటీస్ ఇస్తాం : పార్లమెంటరీ పక్ష నేతసమావేశానికి ఎంపీలు హాజరు కాకపోవడంపై ఆ పార్టీ పార్లమెంటరీ పక్ష నేత అరవింద్ సావంత్ స్పందించారు. "ఈ సమావేశానికి సంబంధించి 'విప్' జారీ చేసినప్పటికీ వారు ఎందుకు హాజరుకాలేదో అడుగుతాము. వారికి సమాధానం ఇవ్వడానికి ఏడు రోజుల గడువు ఇస్తాము. ఒకవేళ వారు స్పందించకపోతే, వారి అనర్హతను కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాస్తాము." అని శివసేన (ఖదీ) లోక్‌సభ ఫ్లోర్ లీడర్ అరవింద్ సావంత్ పేర్కొన్నారు.అంత కుముందు బుధవారమే శివసేన (ఖదీ) తన ఎంపీలకు గురువారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి హాజరుకావాలని ఆదేశిస్తూ విప్ జారీ చేసింది. అయితే, షిందే వర్గం ఈ విప్ చెల్లుబాటును సవాలు చేసింది.

# డీఎంకేకు మరో షాక్ టీవీకే వైపు ఎండీఎంకే



తమిళనాడు రాజకీయాల్లో మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. డీఎంకేకు చిరకాల మిత్రపక్షమైన మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కళగం (ఎండీఎంకే) అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే)తో జట్టుకట్టనుందా అనే చర్చ ఆ రాష్ట్ర రాజకీయాల్లో జోరందుకుంది. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైకో.. సీఎం జోసెఫ్ విజయ్‌తో భేటీ కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. కాగా.. ఇటీవలే వైకో కుమారుడు, ఎండీఎంకే ఎంపీ దురై వైకో కూడా విజయ్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే.కాగా.. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఎండీఎంకే పోటీచేసి రెండు స్థానాలను కైవసం చేసుకుంది. ఆ పార్టీ సాధారణ మండలి సమావేశం ఈ నెలాఖరులో జరగనుంది. పార్టీ భవిష్యత్తు రాజకీయ దిశగా ఆ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకునే అవకాశమున్నట్టు తెలుస్తోంది. అయితే.. టీవీకే నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వంపై జరిగిన విశ్వాస పరీక్షలో ఎండీఎంకే తటస్థంగా వ్యవహరించింది. పార్టీలు అధికార వ్యవస్థలో భాగస్వాములయ్యాయి. మరోవైపు సీపీఐ, సీపీఎం పార్టీలు విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి బయట నుంచే మద్దతు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎండీఎంకే వైఖరి మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

# టెలిగ్రామ్ పై కేంద్రం సంచలన ఆరోపణలు

**న్యూ ఢిల్లీ, జూన్ 18:** ప్రముఖ మెసేజింగ్ ప్లాట్ ఫామ్ టెలిగ్రామ్() చట్టవిరుద్ధ కార్యకలాపాలకు, సైబర్ నేరాలకు ప్రధాన వేదికగా మారిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ప్రస్తుత రోజుల్లో టెలిగ్రామ్ ఓ సరికొత్త 'డార్క్ వెబ్'లా రూపాంతరం చెందిందని, నేరస్థులు, సైబర్ మోసగాళ్లు, తీవ్రవాద గ్రూపులు చట్టం నుంచి తప్పించుకోవడానికి దీనిని విరివిగా ఉపయోగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టులో ప్రభుత్వం ఇవాళ ఓ కీలక అఫిడవిట్ దాఖలు చేసింది.లీకైన పరీక్ష పత్రాలు - ప్రశ్నార్థకమైన భవిష్యత్తు: వంటి ప్రతిష్ఠాత్మక పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ, పంపిణీకి టెలిగ్రామ్ ఛానళ్లు వేదికగా మారాయని ప్రభుత్వం పేర్కొంది. ఇది దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తోందని తెలిపింది.సైబర్ నేరాలు, డేటా లీకులు: నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డేటా ప్రకారం, టెలిగ్రామ్ వేదికగా జరుగుతున్న సైబర్ మోసాలపై ఫిర్యాదులు భారీగా పెరిగాయి. హ్యాకర్లు, సైబర్ నేరగాళ్లు దొంగిలించిన డేటాను విక్రయించడానికి, మనీ లాండరింగ్ కోసం 'మ్యూల్ బ్యాంక్ ఖాతాల'ను కొనుగోలు చేయడానికి ఈ ప్లాట్‌ఫామ్‌ను వాడుతున్నారు.

# ఇప్పట్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించడం సాధ్యం కాదు

పెట్రోల్, డీజిల్ ధరలపై కేంద్రమంతి కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా-ఇరాన్ ఒప్పందంతో ముడిచమురు ధరలు తగ్గిన వెంటనే ఇంధన ధరలను తగ్గించలేమని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినంత మాత్రాన ఇదివరకు పెంచిన ధరలను వెంటనే తగ్గించలేమని పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ తెలిపారు. హర్మూజ్ జలసంధి తెరుచుకున్నప్పటికీ ప్రస్తుతం అక్కడ నౌకల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటు ఓందన్నారు. తక్కువధరకు లభించే ముడిచమురు భారత్‌కు వచ్చేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిపారు. పలు అంశాల వల్ల ఇంధన ధరలను వెంటనే తగ్గించలేమని సురేశ్ గోపి తేల్చిచెప్పారు.



ఇటీవల ఇంధన ధరల్లో నమోదైన పెరుగుదలపై స్పందించిన సురేశ్ గోపి, లీటర్‌కు సుమారు రూ.3.94 మేర పెరుగుదల ప్రభావం మాత్రమే వినియోగదారలపై పడిందన్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు తగ్గాయని చెప్పి వెంటనే ఆ పెరుగదలను వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదని పేర్కొన్నారు. చౌకైన ముడి చమురును భారత్?కు తీసుకురా వడనాకి హర్మూజ్ జలసంధి గుండా రవాణా చేయాల్సి ఉంటుందని, ప్రస్తుతం ఆ మార్గంలో నౌకల రాకపోకలు అధికంగా ఉండటంతో పరిస్థితులు సాధారణ స్థితికి చేరేందుకు కొంత సమయం పడుతుందని వివరించారు. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంపశ్చిమాసియా లో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల కారణంగా చమురు కంపెనీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని సురేష్ గోపీ తెలిపారు. పెరిగిన వ్యయభారాన్ని కొంత మేర కేంద్ర ప్రభుత్వం భరించిందని చెప్పారు. ఈ ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వానికి సుమారు రూ.12 వేల కోట్ల మేర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. అధిక ఇంధన ధరల సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆదాయాన్ని తగ్గించుకునేలా పన్నుల్లో తగ్గింపు చేయలేదని, అయితే కేంద్ర ప్రభుత్వం, చమురు సంస్థలు వ్యవస్థను కొనసాగించాల్సిన బాధ్యతను నిర్వర్తించాయని అన్నారు.కేరళలో ఎయిమ్స్ ఏర్పాటు అంశంపైనా సురేష్ గోపీ స్పందించారు. ఎయిమ్స్ ఏర్పాటు సాధారణ కొనుగోలు ప్రక్రియ కాదని, దీనికి నిర్దిష్ట విధానాలను అనుసరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## ఉద్యోగాల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

# ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి


**వరంగల్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నదమవుతున్న విద్యార్థి, నిరుద్యోగులను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దేందుకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి చే ప్రత్యేకంగా రూపొందించిన ఉచిత ను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గండ్ర రమణా రెడ్డి చేతుల మీదుగా హన్మకొండలోని అంబేద్కర్ భవన్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని శాఖల్లో కలిపి లక్షా 67 వేల ఉద్యోగాలు ఇచ్చింది.పరోక్షంగా ప్రయివేటు రంగంలో స్వాతంత్ర్య భారత దేశంలో ఎన్నడూ లేని విధంగా ఉద్యోగాలు కల్పించార న్నారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఉన్న ప్రయివేటు కంపెనీలు తరలి వెళ్లే పరిస్థితి వచ్చి ఎక్కడా ఉద్యోగ కల్పన జరగడకపోవడం దుర్మార్గం అన్నారు. ప్రతిఅ రెండేళ్లకోసారి పోలీస్ ఉద్యోగాలను భర్తీ చేసుకోవడం బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక అనవాయితీగా ఉండేది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 30 నెలల కావొస్తున్నా ఒక్క పోలీస్ ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని మండిపడ్డారు. విద్యారంగాన్ని సైతం నిర్వీర్యం చేసే కుట్ర సాగుతుంది. ఇప్పటి వరకు ఏ ఒక్క యూనివర్సిటీలో కూడా అధ్యాపక పోస్ట్ లు భర్తీ చేయడం లేదు.ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి అని నోటికొచ్చిన హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే ప్లేట్ పిరాయించారని మండిపడ్డారు. నిరుద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఉన్నత విద్యావంతుడు నిరుద్యోగ యువత సమస్యలు నిత్యం వారు పడే కష్టాలు చూసే వ్యక్తి కాబట్టి మీ అందరి కోసం యాప్ ను రూపొందించిన ఉచితంగా మీకు అందించడం నిజంగా అభినందనీ యమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రొఫెసర్ తిర్నారి శేషు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్, ప్రముఖ న్యూరో వైద్యులు నవీన్ ఉన్నారు.



## యూరియా యాప్ రద్దు చేయాలని

# మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ధర్నా


**నిజామాబాద్ :** యూరియా యాప్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆందోళనకు దిగారు. రైతులు, గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమానికి హాజర య్యారు. మాజీ మంత్రి నేతృత్వంలో జాతీయ రహదారిపై నేతలంతా కలిసి బైఠాయించారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉసురు పోసుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త తరహా యూరియా పంపిణీ వ్యవస్థను తీసుకువచ్చిందని మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. దుకాణాల్లో లేని యూరియా బస్తాలు యాప్ ద్వారా ఎలా రైతులకు అందుతాయని ప్రశ్నించారు. యాప్ వల్ల గ్రామాల్లో రైతులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు



## నెల్లుట్ల ఫ్లైఓవర్ వద్ద ఘోర ప్రమాదం

# లారీ ఢీకొని ముగ్గురు దుర్మరణం







**జనగామజిల్లా:** లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపం లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హనుమ కొండ–హైదరాబాద్ జాతీయ రహదారిపై లారీ ఢీకొనడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. ఎస్సై బండి శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలానికి చెందిన జాట్ రోహిత్ (22) హైదరాబాద్ నుంచి బొలెరో వాహనంలో సామాన్లు తీసుకుని వస్తుండగా నెల్లుట్ల ఫ్లైఓవర్ సమీపంలో టైర్ పంక్చర్ అయింది. దీంతో గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామానికి చెందిన తన డ్రైవర్‌ను జాకీ తీసుకుని రావాలని రోహిత్ చెప్పాడు. ఈ క్రమంలో దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన దొనికెన్ని రాజేందర్ (27) తన లారీలో హనుమకొండ వైపు వెళ్తూ వీరిని గమనించి సాయం చేసేందుకు రోడ్డుపక్కన వాహనాన్ని ఆపాడు. ముగ్గురూ కలిసి బొలెరో వాహనం వద్ద ఉండగా, హనుమకొండ వైపు నుంచి అతివేగంగా వచ్చిన మరో లారీ వెనుక నుంచి బొలెరోను ఢీకొట్టింది.ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## డివైడర్ ఎక్కి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టిన కారు

# ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి

**హైదరాబాద్:** హైదరాబాద్ శివారులో రాజీవ్ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తుర్కపల్లి సమీపంలోని మురహరిపల్లి వద్ద కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వేగంగా వెళ్నన్న ఓ కారు డివైడర్ ఎక్కి.. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ప్రమాద సమయంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్నది.ఈ రోడ్డు ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.



## బాన్సువాడ మున్సిపాలిటీ లో ఎస్సీ కార్పొరేషన్

# రుణాల కోసం లబ్ధిదారుల ఎంపిక

**బాన్సువాడ జూన్ 18 :** బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఎస్సీ కార్పొరేషన్ కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో ఎస్సీ కార్పొరేషన్ కింద 6 యూనిట్లు మంజూరైనట్లు మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు.ఆరు యూనిట్ల లలో 3 త్రీ వీలర్స్ ప్యాసింజర్ ఆటో, గూడ్స్ ఆటోలు 60 శాతం సబ్సిడీపై, 3 ద్విచక్ర వాహనాలు ఇద్దరికీ 60 శాతం సబ్సిడీ, మహిళా కోటాలో 33.33 శాతం కింద ఒక ద్విచక్ర వాహనంతో పాటు ఒక యూనిట్ వ్యవసాయా పంపు సెట్ మోటార్, రెండు గేదెలు లతో కూడిన 6 యూనిట్లు మంజూరు కోసం లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ లో యూనిట్లకోసం 24 దరఖాస్తు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ రెడ్డి, కెనరా బ్యాంక్ మేనేజర్ సిద్ధార్థ మహాపతర, ఎస్సీ కార్పొరేషన్ జూనియర్ అసిస్టెంట్ నరేష్, పాల్గొన్నారు.



## వర్షాలు సంవృద్ధిగా కురవాలని

# వన దేవతకు ఆదివాసుల పూజలు



**నార్నూర్ :** ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం రాంపూర్‌లో ఆదివాసులు అకాడి పండుగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామ సమీపంలోని శివారులో వన దేవత కు సాంప్రదాయ పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పశువులకు కొత్తగా చిగురించిన మేతను తినిపించారు.వర్షాలు సమృద్ధిగా కురువాలని , పంట దిగుబడి రావాలని, మూగజీవాలకు, పశు కాపర్లకు విష జంతువుల నుంచి ఎలాంటి హాని కలుగకుండా రక్షణ కల్పించాలని వన దేవతకు వేడుకున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ హెచ్ కె జంగు పటేల్, దేవారి రూప్ దేవ్, జగ్గేరావు, సీతారాం, దేవ్ రావు, పాండు, దాది రావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అద్దె కరువై వేములవాడలో

# వీధిన పడిన కుటుంబం

**వేములవాడ, జూన్ 18 :** కనీస అద్దె కరువై వేములవాడ పట్టణంలో ఓ కుటుంబం వీధిన పడింది. జగిత్యాల జిల్లా ఎకిన్ పూర్ చెందిన సతీష్ తో రామిడి మానసకు వివాహం కాగా వారి దాంపత్య జీవితంలో ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. అయితే గత ఎనిమిది సంవత్సరాలుగా భర్త పట్టించుకోకపోవడంతో తన కూతురు కుమారుడుతో పాటు కన్నతల్లి వరలక్ష్మితో కలిసి వేములవాడ పట్టణంలో కూలి నాలి చేసుకుంటూ జీవనోపాధి పొందుతోంది. దుకాణాలలో పనిచేస్తూ జీవనోపాధి పొందుతుండగా వచ్చే అరకొర జీతంతో అద్దెకు ఉండడం కూడా భారంగా మారింది. అయినప్పటికీ భగవంత రావు నగర్ లోని ఒక పాత ఇంటిలో అద్దెకు ఉండగా వర్షాకాలం నేపథ్యంలో పాడుబడిన నివాసాల్లో జన సంచారం ఉండకూడదని మున్సిపల్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వెంటనే ఈ కుటుంబాన్ని అక్కడి నుండి బలవంతంగా ఇల్లు ఖాళీ చేయించారు. వర్షం వచ్చి ఇల్లు కూలడం ఏమో కానీ ప్రస్తుతం ఈ కుటుంబం మాత్రం వీధిన పడింది.ఇక పది రోజులుగా అద్దె ఇంటి కోసం వెతుకుతుండగా రూ.3వేల పైగా మాత్రమే అద్దె గదుల ధరలు ఉండడంతో అంత చెల్లించలేని దీనస్థితిలో ఉండి తక్కువ ధరకు ఒకే గది కావాలని తిరుగుతున్న అద్దె గది దొరకకపోవడంతో వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ఓపెన్ జిమ్ లో తమ ఇంటి సామాను అంతటినీ పెట్టుకొని కుటుంబంతో సహా బిక్కుబిక్కుమంటూ గడుపుతోంది. నిలువ నీడలేని తన కుటుంబానికి ప్రభుత్వం కనీసం ఉండడానికి ఒక గూడైనా కల్పించాలని మానస అధికారులను వేడుకుంటోంది.



## విద్యార్థులు విద్యా ప్రమాణాలు

### పెంపొందించుకోవాలి డీఈవో ప్రశాంత్ రెడ్డి



**చిగురుమామిడి, జూన్ 18 :** విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు పెంపొందించుకోవాలని జిల్లా విద్యాధికారి (డీఈవో) ప్రశాంత్ రెడ్డి అన్నారు. చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట గదులను, పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, పాఠ్యపుస్తకాలు, నోట్స్ పంపిణీ, ల్యాబ్, మొదలు రికార్డులను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు విద్యపై ప్రత్యేక దృష్టి సారించి విద్యా ప్రమాణాలు పెంపొందించుకోవాలన్నారు. సెల్ఫోన్, సినిమాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయప్రద, ఉపాధ్యాయులు మంజుల, శ్రీదేవి, సరిత, భాషబత్తిని ఓదెలు కుమార్, తిరుపతి, వేణు, సూర్య ప్రకాష్, పవన్ కుమార్, చారి తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్

### కేటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు పర్యటన



**రాజన్న సిరిసిల్ల, జూన్ 18:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో గురువారం బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి టీ హరీష్ రావు పర్యటించారు. సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తనయుడు ఆశ్విన్ రావు ద్వాదశ దినకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. అశ్విన్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం సిరిసిల్ల లోని జిల్లా దహన లో తంగళ్ళపల్లి మండలం కేసీఆర్ నగర్ లో పానీపూరితిని తీవ్ర అస్వస్థకు గురైన చిన్నారులను దవాఖానలో పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

అనంతరం సిరిసిల్లలోని సీనియర్ జర్నలిస్ట్ టీవీ నారాయణను పరామర్శిం చారు. ఇటీవలే టీవీ నారాయణ తల్లి వెంకట లక్ష్మి మృతి చెందగా, వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమా ల్లో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సిం గరావు, మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్,బొల్లి రామ్మోహన్, పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.


EDITOR PRINTER AND PUBLISHER OWNED BY BILLALPURSARA SHIVA KUMAR, PRINTING AT RIYAZ PRINTING PRESS, S NO 22-8-161, BEHIND NAYAAB HOTEL, CHATTA BAZAR, HYDERABAD, TELANGANA - 500002 AND PUBLISHED FROM H.NO: 2-1-602, TARAKARAMA NAGAR, YELLAMMABANDA, KUKATPALLY, MEDCHEL-MALKAJGIRI DIST, TELANGANA-500 072. PRGI: TGTEL/26/A4985. PHONE NO: +91 8686861338, +91 81215 50907 EMAIL : shivakumarlal@gmail.com